

"ఇంతదూరంలో యిచ్చాను పిల్లను" అన్న బెంగ ఇంకా తీరకముందే పార్వతి పిల్లతల్లి అయిపోవడం తల్చుకుని ఆశ్చర్యపడి, తనలో తను నవ్వుకున్నారు రత్నమ్మగారు. పిల్లకోసం పట్నంకాపురం పెట్టి, ఆ పిల్లకి మూడుముళ్ళు పడ్డంతో బాధ్యతకాస్తా తీరిందని హాయిగా పట్నం వదిలి పొలం పుట్రా ఉన్న పల్లెటూరికి వెళ్ళిపోయారు. చిన్నప్పుడు పెద్దల ధర్మమా అని అబ్బిన చదువుతో పురాణాలో పుణ్యకథలో చదువుకుంటూ కాలం వెళ్ళబుచ్చేయాలని ఆవిడ కోరిక !

అల్లుడు పార్వతిని తీసుకొచ్చి పురిటికి దిగవిడిచిన రోజులు నెమరువేసుకుంటూ అప్పుడే వచ్చిన ఉత్తరం చదువుకొంటున్నారు ... నానిగాడికి నాలుగో ఏడు వచ్చేసిందా ? నా ప్రాణాలు కొరికేస్తున్నాడు. అక్కడికొచ్చి పురుడు పోసుకోవడం కంటే నువ్వే ఇక్కడికి వస్తే సులువేమో అంటూ పార్వతి రాసింది. 'వెర్రితల్లి ! నిన్నగాక మొన్న కాపరానికి వెళ్ళింది ! అప్పుడే ఎంత బాదరబందా !' నిట్టూరుస్తూ ఆలోచనలో పడ్డారు. అక్కడికి వెడితే మడా ఆచారం జరగదేమో ! పురిటికి సదుపాయంగా ఉంటుందో ! ఉండదో ?...

తెగని సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. రత్నమ్మగారు కూతురికి పురుడు పోయడానికి పల్లె వదిలి భిలాయ్ వంటి ఉక్కుపట్నం వచ్చారు...అంతా సవ్యంగా గడిచిపోతే ... అనుకుంటూ ఆంధ్రదేశపు అందరి దేవుళ్ళకీ మొక్కుకున్నారు. కళ్ళుతెరచి మూసేలోగా కాలంకాలం మారుస్తుంది కదా! పండంటి మనుమరాలు పుట్టింది. మూడు నెలలూ, చూస్తుండగానే, ఐదు నెలలూకూడా వెళ్ళిపోయాయి. రత్నమ్మగారికిటు మనుమరాలిని వదలాలనీ లేదు. అంటిముట్టనట్టు ఈ కొత్త పట్నంలో ఉండాలనీ లేదు. తెగించి ఓరోజు అల్లుడితో ప్రస్తావించారు తిరుగు ప్రయాణపు సంగతి "దానికేం అన్ని ఏర్పాట్లు చేస్తాను వెడుదురుగాని" అన్నాడు. అల్లుడు కృష్ణమూర్తి. ఇంతసౌమ్యుడైన అల్లుడిని తల్చుతల్చుకు మురిసిపోతారు రత్నమ్మగారు అమ్మాయి అదృష్టం అని పొంగిపోతూ ఉంటారు...దానాదీనా రత్నమ్మగారి ప్రయాణం వెనక్కి

కె. రామలక్ష్మి

వెడుతూ వచ్చినా, చివరికి తెముల్చుకుని పల్లెకి వచ్చిపడ్డారు.

ప్రతి సంవత్సరం ఖిలాయే వెళ్ళడం, ఓ నెల్లాళ్ళు, నెలంటే నెలే - ఉండడం, తిరిగి రావడం - సంప్రదాయంగా అలవాటు చేసుకున్నారు. మనవడిమీది ఆవిడ ఆపేక్ష ఇలా బానిస చేసిందావిడని:

*ఇదంతా — గతం —*

*ఇక వర్తమానం —*

...అప్పుడే చీకటి పడుతూంది. దీపాలు తోరణాలలాగా వెల్గుతున్నాయి. క్లబ్బుల్లో. దీపాలు వేసుకునే ఆడుతున్నారు స్త్రీ పురుషులు. పార్వతి "మహిళా సంఘం"నుంచి అర్జెంటుగా ఇంటికి వచ్చింది. అమ్మఉంది కాబట్టి అని చెప్పుకుంటూ హాయిగా కాలక్షేపం చేసింది యీ నెల్లాళ్ళు. ఇక అమ్మ తిరిగి వెళ్ళిపోయేరోజు వచ్చేస్తూన్న కొద్దీ - తన రెక్కలు ఎవరో త్రిక్కు చేస్తున్నట్టు అనిపించసాగింది పార్వతికి. తను చెప్పనక్కర లేకుండానే నానిగాడిదీ, బేబీదీ బాధ్యత రెండు చేతులా అందిపుచ్చుకుంటుంది. వంటింటి యజమాయిషీ చేసుకుంటుంది. నే ఉండగా నీ కెందుకే — పోయి హాయిగా పడుకో అంటుంది. అయినా తనకి మాత్రం—ఇది నా ఇల్లు, నే లేకపోతే ఓ క్షణం గడవదు అనిపిస్తుందేమిటి! ... హడావిడిగా హాండ్‌బాగు కుర్చీలోపడేసి. జోళ్ళు మూల విప్పి వంటింటిలోకి వచ్చింది పార్వతి. తలుపులన్నీ తీసే ఉన్నాయి గాని ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అమ్మ పిల్లల నెక్కడికేనా తీసుకెళ్ళిందేమిటి? అనుకుంటూనే కాఫీకి సిద్ధంచేసుకుని ఓకప్పు వేడిగా తాగుదాం అనుకుంది. ఆయ నొచ్చేసరికి ఎలాగా తొమ్మిది అవుతుంది. ఈలోగా కాఫీ కొంచెం ఓపిక నేనా ఇస్తుంది. అనుకుంటూనే కాఫీపొడి డబ్బాకోసం అలవాటుగా చెయ్యిపెట్టింది-అబ్బే! అది అక్కడెందుకుంటుంది. అమ్మ మళ్ళీ ఇల్లు చక్కపెట్టడం ప్రారంభించినట్టుంది. ఉసూరుమంది పార్వతిప్రాణం. అమ్మ ఎప్పుడు వచ్చివెళ్ళినా ఇంతే! ఇంట్లో ఏదో ఒక భాగం పూర్తిగా తలక్రిందులు చేస్తుంది! యీసారి వంటగదిని పట్టించినట్టుంది!! ఎడంచేతివాటం ఉన్న పార్వతి ఎడమవైపున అమర్చిన సామానంతా కుడివైపు వచ్చింది! పాత్రలన్నీ అడుగు గూటిని చేరాయి. 'ఎందుకమ్మా ఇలా చేస్తావు?' అంటే — ఆమాత్రం వంగలేవుటే — అయినా ఇలావుంటే చూడు ఎంత విశాలంగా ఉందో, అంటూ వివరణ ప్రారంభిస్తుందేమో అని పార్వతిదిగులు- ఏదైనా మాటా మాటావస్తే తను మాట జారితే అమ్మమనసు నొచ్చుకుంటుందేమో అని భయం.

ఇంట్లో ఈ చిన్న మార్పులకే పార్వతి హృదయం కోపంతో ఎగసిగకుపడింది కాని మరుక్షణంలోనే - సిగ్గుపడింది...

పాపం, తన సుఖంకోసమే అమ్మ ఇలాంటి చిన్న విషయాలు సహితం పట్టించుకుంటుందే!... అయినా కూడా వచ్చిన ప్రతిసారీ ఏదొక మార్పు తెస్తుం దెందుకు తన జీవిత విధానంలో?

"ఏం పార్వతీ, ఇప్పుడు వంటిల్లు బాగుంది కదూ?'' అప్పుడే వంటింటి గుమ్మంలోకి అడుగెట్టిందికాబోలు అమ్మ!

క్రితం క్షణంలో తనలో తలెత్తిన అసహనాన్ని దిగమింగుకుంది పార్వతి. మాట్లాడకుండా ఊరుకుంది.

"ఇలా అమర్చుకుంటే అంతా సులువుగా వుంటుందని తోచిందే. నువ్వో లాగా అశ్రద్ధ చేస్తావనీ..." అమ్మ కొనసాగిస్తూనే ఉంది.

'అమ్మా! ఆపు! అమ్మ! అమ్మా! నేను పెద్దదాన్ని అయాను. నా ఇల్లు నేను చక్కపెట్టుకోలేనా?' తనలో తను స్వగతం పలుక్కుంది పార్వతి. 'నాకు పాతికేళ్ళు దాటుతున్నాయి. నాన్నిగాడి కై దేళ్లు వెళ్ళిపోతున్నాయి. ఇంకా నన్నో పసిదానిలాగా చూస్తావేం?' అనుకుంది.

'నా కిష్టమైన పద్ధతిలో నా పనులు చేసుకుంటే నీ కేం?'

'నా ఇల్లు నా కిష్టమొచ్చినట్టు సర్దుకో నియ్యవేం?'

ఈ ప్రశ్న లన్నీ నిశ్శబ్దంలోనే. పైకొక్కటీ గట్టిగా అనలేదు పార్వతి.

ఎలా అంటుంది? ఎంతో సంతృప్తి ప్రకటిస్తూ గుమ్మంలో అమ్మ నిలబడి ఉంటే!!

"నువ్వేం అనుకోవు కదూ పార్వతీ?... నీ కిలాసర్దితే ఇబ్బంది అయితే చెప్పు - చిటికెలో మార్చేస్తాను"

"లేదమ్మా. నాకేం ఇబ్బందీ?.. " అంది చటుక్కున పార్వతి. అందేగాని ఆ కంఠస్వరంలో ఏదో పెడసరితనం తనకే ధ్వనించినట్లు అనిపించి . పనిలో తల దూర్చేసింది పార్వతి.

రాత్రి భోజనాల దగ్గిర సరదాగానే ఉన్నా అదంతా ఏదో తెచ్చిపెట్టుకున్న ట్టుగా అనిపించింది. రైలుటైము చర్చిం చుతూ కూర్చున్నారు రత్నమ్మగారు అల్లుడు అన్నీ వివరంగా చెప్తున్నాడు—అంతకు మించిన సంభాషణా విషయం లేనట్టు!... నానిగాడు 'ఊ'! వాగి పారేస్తున్నాడు — ఇంతోటి స్కూలుని గురించి... వచ్చీరాని మాటలు — నోటి నిండా అన్నం - వాడేం చెప్తున్నాడో ఆ పరమేశ్వరుడికే తెలియాలి - గాని అందరూ నవ్వారు — ఓ దొరబిడ్డ అగ్గి పెట్టెలో కప్పపిల్లని తెచ్చి టీచరు కిచ్చా డుట - తెరవమని. ఆవిడగారు నాలాంటి ధీమంతురాలే కాబోలు! అనుకుంది పార్వతి - లేకుంటే అగ్గిపెట్టెలో కప్ప పిల్లని చూసి పిచ్చికేకలు వేసిందట ఆ ఇల్లాలు? "నోటినిండా అన్నం పెట్టుకుని నవ్వద్దని చెప్పలేదురా వెధవా'' అంటూ

మీదపడ్డ మెతుకులు దులుపుకొంది పార్వతి.

కుర్రవాడి కబుర్లకి అందరితో పాటూ తనూ నవ్వినా అది - ఆ కప్పను చూసిన పంతులమ్మని తలుచుకునా? నానిగాడి నత్తి మాటలు వినా! సహనానికి సరిహద్దు చేరిన తన చెప్పలేని మనోభావన నూహించుకొనా? తర్కించుకుంటూ ఎంగిళ్ళన్నీ ఎత్తి వంటిల్లు సర్దింది పార్వతి.

అమ్మమ్మ వెళ్ళిపోతుందన్న బెంగతో ఆవిడ పక్క వదలకుండా కొంగట్టుకు తిరుగుతున్నాడు నానిగాడు. బేబిని ఒక పక్క, నానిగాడిని ఒకపక్క పడుకోబెట్టు కొని రెండు పిల్లులూ-రొట్టిముక్కా కథ సరికొత్తగా చెప్తున్నారు రత్నమ్మగారు. పడకగదిలోకి వెళ్ళేదాకా జరిగిన సంగతి చెప్పి తన హృదయంపై భారం తీర్చు కొనే అవకాశం చిక్కలేదు పార్వతికి.

కుర్చీలో కూర్చుని కృష్ణమూర్తి నిశ్చింతగా పేపరు చూసుకుంటున్నాడు. సరిగ్గా ఉన్న దుప్పట్లు సరిగ్గావేస్తూ, "చూశారా? మళ్ళీ అంతే చేసింది! వంటి ల్లంతా తల్లకిందులు చేసిపెట్టింది... ప్రతివస్తువూ ..."

"భోజనాల దగ్గిర నీ ధోరణి చూసి ఏదో జరిగిందనే అనుకున్నాను పార్వతీ, ఇలా రా...అలాంటి సిల్లీ విషయాల కిలా సతమతమైపోతావేమిటి?"

కుర్చీలో కూర్చునే పార్వతి నడుం చుట్టూ చేయివేసి దగ్గిరగా తీసుకున్నాడు కృష్ణమూర్తి.

(పెళ్ళినాడెలా ఉన్నాడో యీనాడూ కృష్ణమూర్తి అలాగే ఉన్నాడు. పార్వతి కంతుపట్టని విషయాలలో ఇదీ ఒకటి!)


అతని చేతిలో ఒదిగినా కస్సున చూసింది పార్వతి.

"ఆఫీసులో నీబల్ల దగ్గిర ఎవరినేనా ఓ గంట కూర్చోపెట్టి వెడితే - అంతా వాళ్ళిష్టం వచ్చినట్టూ కెలికిపారేస్తే నీ కెలా ఉంటుంది?"

"వాడి పీక అమాంతం కొరికేయా లనిపిస్తుంది?" పార్వతి ముక్కుమీద పుట్టుమచ్చకి అంటీ అంటనట్టు చూపుడు వేలుతో అంటాడు కృష్ణమూర్తి. ఆ చేతిని విదిల్చికొట్టింది పార్వతి "ఔ నవును. నువ్వయితే అలా చేస్తావు మరి మా విషయం వేరుకదా! ఆ బల్ల నీ ఉద్యోగంలో ఒక భాగం...నీలో ఒక భాగం. కాని...అమ్మతో...వచ్చిన చిక్కే అది. నేనింకా తనలో ఒకి భాగం అనుకుంటుంది...నా చుట్టూ వాతావరణం తనదే అనుకుంటుంది ఆఖరుకి నా వంటిల్లుకూడా..." కృష్ణ మూర్తి చేతిలోంచి తప్పించుకుని మంచం దగ్గిరకు వెళ్ళి నిలబడింది పార్వతి. కృష్ణమూర్తి కూడా లేచి హాయిగా పడుకున్నాడు. ఓ మోచేతిమీద లేచి పార్వతి ముఖంలోకి చిలిపిగా

చూస్తూ 'నువ్వు కోపం తెచ్చుకోకుండా కొంచెం విను పార్వతీ' — అత నామాట అనేలోగానే పార్వతికి కోపం రానే వచ్చింది మంచం అంచున కూర్చుని తలగడ ఒళ్ళోకి తీసుకుంది. మనసులో కసి అంతా ఆ తలగడ అనుభవిస్తూంది. "మీ అమ్మలాంటి మనుషులు చాలా అరుదు. ఆవిడ కెవరి జీవితంతోనూ జోక్యం కలుగచేసుకోవాలన్న కోరిక ఉన్నట్టు తోచదు. అదే ఉంటే — ఆ పల్లెలోప డెందుకుంటారు చెప్పు? ఆవిడకీ ఎవరూ లేరుకదా? ఇక్కడ మనదగ్గిరే ఉంటా ననేవారుగా? వస్తారు, ఓ నెలేనా ఉండకుండా వెళ్ళిపోతారు. ఎవరినీ విమర్శించరు. ఎవరికీ సలహా లివ్వరు...ఒచ్చిన చిక్కంతా నాదగ్గిరే వస్తూంది — ను వ్వావిడ నలా చెయ్య నిస్తావు. పోనీ వద్దని చెప్పేయకూడదూ" ఈసారి తలగడ స్థానం కృష్ణమూర్తి తల ఆక్రమించుకుంది. అతని రేగిన జుట్టులో వేళ్ళుంచి లెక్క లేనన్ని పాపిళ్ళు తీస్తూ వింటూంది పార్వతి. అతని మాట పూర్తి అయేసరికి హఠాత్తుగా ఆమె వేళ్ళ నాట్యం ఆపి, వాటి సందున చిక్కుకున జుట్టు అలాగే గట్టిగా పట్టుకున్నాయి. కృష్ణమూర్తి మటుకు నిశ్చింతగా పార్వతి ఒడిలో సర్దుకు మరీ పడుకున్నాడు.

"అంటే?...తాకకూడదు! అంటూ నోటీసులు పెట్టాలనా? ఏమిటి నీ



ఉద్దేశ్యం?" తీవ్రంగానే అడిగింది పార్వతి.

'నా జుట్టు వదులు. మెల్లిగా అలా రాయి — నిద్ర వస్తూంది' అన్నాడు బదులుగా కృష్ణమూర్తి.

ఒత్తిగిలి పడుకున్న అతణ్ణి బలవంతాన తిప్పింది పార్వతి

"ఏమిటి చెప్పేది? అన్నమాటేదో అనేసి అలా ఘుంగిలా ఊరుకుంటావేం?"

"అదికాదు పార్వతీ, ఆవిడేది మార్చేసిందో అని ఇంత గొడవ పడిపోతావుకదా — పోనీ మళ్ళీ నీకు కావలసినట్టు తిరిగి సర్దేసుకో వెందుకూ? ఆవిడ చేసేపని నీకిష్టంలేకుంటే తక్షణం మార్చేయవచ్చుగా?" తన ముఖంలోకి తీవ్రంగా చూస్తున్న పార్వతిని దగ్గిరకు లాక్కోబోయాడు కృష్ణమూర్తి. "అలా చెయ్యవు సరికదా ఊరికే ఇదైపోతావు. మీ అమ్మగారు వెళ్ళిన ఓ అర్నెల్లకి కాని తిరిగి నా మనిషివి కావు కదా!"

వెల్లికిలా పడుకుని మెడకింద చేతు లాన్చుకున్నాడు కృష్ణమూర్తి. "అంచేత నేను అనుకునే దేమిటంటే — నువ్వు ఆవిడ చేస్తున్న పనికి అంతరాంతరాలలో హర్షిస్తూ నేనా ఉండాలి. లేదా? అంటే..." కృష్ణమూర్తి మాట పూర్తిగా వినకుండానే పార్వతి లేచి వెళ్ళిపోయింది...

తరువాత కొద్దిసేపటికే కృష్ణమూర్తికి నిద్రపట్టేసింది. పార్వతి మటుకు పడక గది వాసాలు లెక్కపెడుతూ, ఎదో అంతు తెలియని ఆలోచనలతో మెలుకువగానే ఉండిపోయింది ... కృష్ణ అన్న మాటలో అర్ధంలేకపోలేదు అనిపించింది కాని అతనికి అర్ధంకానిదీ కొంత ఉందనిపించింది పార్వతికి అమ్మచేసే ఈ పని తను స్వతంత్రురాలు కాదని పదేపదే జ్ఞప్తికి తేవడానికి కీలకంగా వుంటుంది. 'నేను నీ తల్లిని. నీ క్షేమం నాకు తెలుసు' అనే అమ్మ మాటలు చెవుల రింగుమంటున్నాయి. ఆ మాటలలో — 'నువ్వు చిన్నదానివి నీకేం తెలియదు —' అని తోసిపారేయడం విన్పిస్తూంది — 'పోనీ చెప్పకూడదు?' అనే కృష్ణమూర్తి మాటల్లో — 'ప్రవర్తిస్తే పెద్దదానిలాగా వ్యక్తిత్వం ఉన్నదానిలాగా ప్రవర్తించు — మీ అమ్మకు చెప్పు - నే పెట్టనవి పెట్టినట్టే ఉంచమని! లేదంటే - ఆవిడ పెద్దరికం తలదాల్చు' అంటున్నట్టుంది.

'కాని ఈ రెండిటిలో ఏ ఒక్కటీ అంత సులుకాదని మగాళ్ళ కెలా తెలుస్తుంది,' అని తృప్తిపడి కళ్ళుమూసి బలవంతాన నిద్ర తెచ్చుకుంది—పార్వతి.

తెల్లారింది మొదలు ఇంట్లో ఒకటే హడావిడి. నానిగాడు ఒకటే ఏడుపు — అమ్మమ్మతో వెళ్ళిపోతానని పెట్టేబేడ కట్టేశారు. స్టేషనుకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నా రంతా. ముక్కుమీదకిజారిపోతున్న కళ్ళద్దాలు కొంగుతో తుడుస్తూ "అమ్మాయి ఎప్పుడొచ్చినా వెళ్ళడం ప్రాణాంతకం అయిపోతోందే!..ఏమో, ఇక మళ్ళీ చూస్తానో లేదో..." ఒణుకుతున్న అమ్మకంఠం. కంటిరెప్పలనంటి జారడానికి సిద్ధంగాఉన్న కన్నీరు

అన్నీ పార్వతిని కదిలించివేశాయి

ఈమాటు వచ్చినప్పుడు దయచేసి నాయిల్లు చక్కబెట్టకు. ఎలా ఉన్నవి అలా ఉండనీయి.' అని తెల్లవారగానే చెప్పాలని ఎంతో ప్రయత్నించింది పార్వతి. కాని ఎప్పటికప్పుడే 'ఇప్పుడు కాదు' అనిపించి ఊరుకుంది.

"ఇలా నీ దగ్గిరకి వచ్చినప్పుడు అనిపిస్తుంది — నేనింకా బ్రతికే ఉన్నాను అని. ఎన్నాళ్ళిలా నాజీవితం సాగాలో? మీ నాన్న పోయారు. నువ్వు పెళ్ళిచేసుకుని నాకు దూరంగా వచ్చేశావు. ఒక్కొక్కప్పుడు అనిపిస్తుంది — నేనెవరికీ అంత అవసరం లేదని!" కళ్ళు తుడుచుకుని బేబీని చంకన వేసుకున్నారు రత్నమ్మగారు.

"అమ్మా ... నేను..." పార్వతి ఏదో చెప్పాలనుకుంది — ఆమె చెప్పబోయిన సంగతి చేత్తోనే వారించేస్తూ.

"వద్దమ్మా. నన్నిక్కడికి వచ్చి ఉండమనకు. ఈ కట్టె ఆ మన్నులోనే కలిసిపోవాలి..." అన్నారు రత్నమ్మగారు. చేసుకున్న నిశ్చయం కాస్తా కరిగిపోయింది పార్వతికి. ఆ క్షణంలో తనూ బేబీనే అనిపించింది పార్వతికి.

'అమ్మకి నేను కావాలి.'

'నేను అమ్మకి కావాలి.'

అమ్మని కాదని తను నిలబడలేదు.

అమ్మ తెచ్చిన మార్పులు అలాగే ఉండిపోతాయి

'పోనీలెద్దూ — నాకో పెద్ద వ్యక్తిత్వం లేకపోతే నేం?' అనుకుంది

'పెద్దపిల్లలు నాలాగా సతమతమయిపోతారు. తర్కించుకు బుర్ర పాడుచేసుకోరు. వాళ్ళ నిశ్చయాలు వాళ్ళు చాపకింద నారులాగా — అమలులోకి తెచ్చేస్తారు' అనుకుంది.

'మాట్లాడకుండా నా చిత్తం వచ్చినట్టు సర్దేస్తాను. పాపం! అమ్మకీ ఏం తోచదు. తనవసరం ఉందని నిరూపించుకోడాని కన్నట్టు ఇలా మారుస్తుందేమో! అనుకుంది.'

ఎదురుగా ఏమీ మాట్లాడకుండా నిలబడిన కూతుర్ని దగ్గిరకి తీసుకున్నారు రత్నమ్మగారు.

"ఈమాటు త్వరలోనే వస్తానే—నాని గాడిని చూడక నా ప్రాణంపోదు," అంటూ బండి ఎక్కడానికి ముందుకి నడిచారు.

'అమ్మా, తప్పకుండా రావాలి. నువ్వెళ్ళిపోతే ఇల్లు అవురుమంటూ ఉంటుంది.' చిన్నపిల్లలాగా అమ్మ వెనక నడుస్తూ బ్రతిమాలింది పార్వతి.

'అమ్మ రైలు కదిలాక ఇంటికివచ్చి వంటిల్లు దిద్దడానికి బోలెడు టైముంటుంది,' అనుకుంది. ఊసరవెల్లిలాగా రంగులు మారుస్తున్న పార్వతి కళ్ళలోని భావాలు చూసి నవ్వుకుంటూ కారెక్కి తలుపు వేసుకున్నాడు కృష్ణమూర్తి